# వ్యాపారం

షాపుముందు నువ్వు సైకిల్ పెడ్తే ఎత్తుకుంటుంటేగా ఎవరైనా చూశావా? నువ్విస్తున్న రిపోర్టు కరెక్టేనని ఏమిటి నమ్మకం? అసలింతకూ అది నీ సైకిలేనా? నీ సైకిలే అనడానికి ఏమిటి ఋజువు? నీ సైకిల్ అయితే పట్టపగలు లాక్ వేయకుండా అలా వదిలేస్తావా? సైకిల్ పోయిందని గంట తర్వాత వచ్చి చెప్తావా పోలీసుస్టేషన్‌కి? నువ్వు చెప్పేది ఎలా నమ్ముమంటావ్?

ముఖమంతా చెమటలు పట్టేశాయి సదాశివానికి. కొంపదీసి తన సైకిల్‌ని తనే దొంగతనం చేయలేదు కదా అని అనుమానం వచ్చేసింది.

పగలబడి నవ్వాడు హెడ్డు. తనివితీరా నవ్వుకున్నాడు. —సరేనయ్యా! నీ సైకిల్ పోయింది. రిపోర్టిచ్చావు. మేమూ వెతుకుతాం. దొరుకుతుందనీ, దొరకాలనీ ఏమిటి గ్యారంటీ? నీ సైకిల్ తీసుకెళ్ళినవాడు నీకన్నా తెలివైనవాడే కదా! ఈసరికి నీ బండి ఊరుదాటియిపోయి వుంటుంది. లేకుంటే షేపులు మారిపోయి వుంటుంది. ఇప్పుడు నీ సైకిల్ నేతెచ్చి నీముందు పెట్టినా, అప్పు ఇది నాదెలా అవుతుంది? అనేస్తావు నువ్వు. అంతగా మారిపోయివుంటుంది.

బుర్ర గోక్కున్నాడు సదాశివం. ఎందుకొచ్చానా పోలీసుస్టేషన్‌కి అని తిట్టుకున్నాడు.

హెడ్డు కుర్చీలోంచి లేచి ముందుకొచ్చి సదాశివాన్ని భుజం తట్టాడు. కొంచెం ఆత్మీయంగా అన్నాడు—ఎల్లుండి నీ తమ్ముడి పెళ్ళి. నీకిప్పుడు చాలా పనులున్నాయి. ఊరంతా తిరగాల్సి వస్తుంది. సైకిల్ కావాలి. అంతేకదా?

—అవునండి, అంతేనండి, అన్నాడు సదాశివం ఆశగా. —ఎలాగైనా మీరు నా సైకిల్ కొంచెం తొందరగా వెతికి పట్టుకోవాలి.

ఆత్మీయత మానేసి, తీక్షణంగా చూశాడు హెడ్డు. —ఏం? నీ సైకిల్ అయితేగాని నువ్వు తొక్కలేవా? చెప్పలా? నీ సైకిల్ ఈ సరికే చేతులు మారి షేపులు మారి పోయుంటుందిగాని. అదిగో అటుచూడు—

చూశాడు సదాశివం. స్టేషన్ ప్రహరీ కివతల నాలుగు సైకిళ్ళు వరసగా ఉన్నాయి.

—చూశావా? అన్నాడు హెడ్డు. —అవన్నీ చోరీ సైకిళ్ళే! ఎవరి సైకిల్ ఎవరికి దక్కుతుందో తెలీదుగాని, నూటయాభై ఇచ్చి నీక్కావలసిన బండి పట్టుకెళ్ళు.

కళ్ళతో చెప్పినట్టు, తన చెవులను తానే నమ్మలేక పోయాడు సదాశివం.

—అదేమిటండీ! నా సైకిల్ పోతే, ఎవరి సైకిల్ నేనెలా?...

—అదంతేనయ్యా! మన పద్ధతి అంతే. నీ సైకిల్ అసలు దొరుకుతుందో లేదో తెలీదు. దొరికితే ఎప్పుడు దొరుకుతుందో తెలీదు. ఏం? సంవత్సరం పట్టొచ్చు. అంతవరకు ఆగుతావా? నీ ఇష్టం... నీకిప్పుడు ఒక సైకిల్ అత్యవసరం కాబట్టి, వన్‌ఫిఫ్టీ ఇచ్చెయ్— ఆ నాలుగిట్లో నీక్కావలసింది తీసుకోపో... ఒక్కేఛాన్సనుకో.

అయోమయం నుంచి తేరుకోలేక పోతున్నాడు సదాశివం. అంతలో ఫోన్ మ్రోగింది. —ఇటుగో రమణా!, అని పెం.జీని కేకేశాడు హెడ్డు. —వ్యవహారం అంతా ఈయనకి వివరించి చెప్పు... మొగుడు పిలుస్తున్నాడు. అంటూ రిసీవ రందుకున్నాడు.

పెం.జీ గుంభనంగా నవ్వుతుండగా వచ్చి సదాశివాన్ని వరండాలోకి తీసుకుపోయాడు. సైకిల్ చోరీల వ్యవహారాలన్నీ, వాటిలోని సూత్రాలన్నీ, సూక్ష్మంలో మోక్షంగా వివరించి చెప్పేశాడు. —పోయిన మీ సైకిల్ ఎలాగూ పోయిందిసార్, మళ్ళీ దొరుకుతుందనే ఆశలేదు. దొరికినా, అప్పుడైనా ఇంతే. మా హెడ్డుకి చేయి తడపందే సైకిల్ మీ చేతికిరాదు. అదేదో ఇప్పుడే చేసేస్తే, మీ సైకిల్ కన్నా మంచిదింతే పట్టుకెళ్ళొచ్చుగదా మీరు! చూడండి.. ఆ నాలుగిట్లో ఎర్రబండి చాలా బాగుంది.

గుమాస్తాగిరీ వెలగబెడుతున్న సదాశివానికి 'మామూళ్ళ' జాతకం మామూలే. రైళ్ళ రిజర్వేషన్లకు, బస్‌సీట్లకు, తాలూకాఫీసులో పనులకు కరెంటు కనెక్షన్‌కు అతనూ మామూళ్ళు సమర్పించినవాడే! అయితే ఇదివేరు. ఇది పోలీసులతో వ్యవహారం; పెడిసికొడితే?

ఆలోచనలతో క్రిందు మీదవుతూ చాలా సేపు అలాగే ఉండిపోయాడు సదాశివం. జేబులో డబ్బేమో ఉంది. నూటయాభై చెల్లించి మంచి సైకిలే తీసుకుపోవచ్చు. కాని...

ఆదరాబాదరాగా బయటికొచ్చాడు హెడ్డు. —కాలనీలో దొంగతనముట—నేను వెళ్ళాలి గానీ..., అంటూ సదాశివం వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

—ఏం తేల్చావయ్యా.

—ఏమీ...తగ్గదాండీ...,అన్నాడు సదాశివం, కొంచెం తొక్కంగా.

—భలేవాడివే. దమ్మిడీ తగ్గదు. వంద నాకూ, యాభై రమణకూ... తొందరగా తేల్చు., ఎస్సైయ్‌వస్తే కథ మారిపోతుంది...

—ఆ ఎర్రపెయింటు సైకిల్ తీసుకుంటానండి... అయితే ఎక్కడైనా అసలు వోనర్ చూసి... గుర్తుపట్టి, ఇది తనదేనంటే ..

ఉరిమి చూశాడు హెడ్డు. —అసలువోనర్! ఎవడా అసలు వోనర్? రమ్మనుచెప్తాను! వాడూ ఇక్కడికి రావలసిందే కదా! అంతెందుకూ?, అంటూవెళ్ళి సైకిల్ కున్న ఎర్రసీటుకవర్ లాగేసి ఒక్క ఉదుటున దాన్ని [illegible] అవతలికి గిరాటేశాడు.., —ఇప్పుడు నువ్వే అసలు వోనర్‌వి.. కాదనేదమ్ము ఎవరికి ఉంది?

సదాశివం డబ్బు అని లెక్కపెట్టటం పూర్తవుతుండగానే, చప్పున నోట్లని లాక్కున్నాడు హెడ్డు. —ఏం మనిషండీ బాబూ! ఇలా అయితే బ్రతకటం ఎలా? ఎస్సైయ్‌వస్తే వాటాలు తీస్తాడుగాని, వెంటనే బండెక్కి వెళ్ళేయ్ ..., అంటూ స్వంత సైకిల్ వైపునడిచాడు. నెత్తిన టోపీ సరిచేసుకుంటూ.

# మినీ కథ

## నిజాయితీ చిరునామా

సీటులో కూర్చున్నాడేగాని, పావనమూర్తి మనసు మనసులో లేదు. పొద్దున్న ఆఫీసుకు వచ్చినప్పటినుంచీ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అయితే అతగాడు ఆలోచిస్తున్నది, తన పక్కసీట్లో కూర్చుని, 'మేగీ నూడుల్స్'లా నోరూరించే టైపిస్టు, 'మిస్ మార్గరెట్'ని ఎలా ట్రాప్‌చెయ్యాలా అనికాదు.

ఎదురుసీట్లో కూర్చునే 'ఎల్డీసీ' ఏకనాథం నుంచి యాభై రూపాయలు అప్పు ఎలా పుట్టించాలా అనీకాదు... పోనీ, కొత్తగావచ్చిన 'బాస్'ని ఎలా కాకాపట్టాలా? అనికూడా కాదు.

మరింతకీ, అతగాడి మనసుని అంతలా దోచుకున్న విషయం ఏమిటంటే, ఆరోజు ఆఫీసుకి కొత్త 'స్టేషనరీ' స్టాకు రావడం.

ఆ పాలమీగడలాంటి తెల్లకాగితాల దొంతర్లని చూస్తుంటే, పాలకోవాలాంటి, పదహారేళ్ళ పడుచుపాపల్ని చూస్తున్నంత పరమానందంగా ఉంటుంది పావనమూర్తికి. అలాంటి అందమైన అమ్మాయిని లేపుకుపోవడంలో ఎంత 'థ్రిల్' ఉంటుందో, ఆ తెల్లకాగితాల దొంతర్లని మూడో కంటికి తెలీకుండా, ఇంటికి పట్టుకుపోవడంలో, అంతకు రెట్టింపు 'థ్రిల్' ఫీలవుతాడు పావనమూర్తి.

ఆ విషయమై, మధ్యాహ్నం 'టీ టైమ్' వరకూ అతి తీవ్రంగా ఆలోచించిన పావనమూర్తి ఓ నిర్ణయానికి వచ్చి, ప్యూను పాపారావుని పక్కకుపిల్చి, తన పథకాన్ని, అతగాడి చెవిలో, గాయత్రీ మంత్రంలా విశదీకరించి, ఉపదేశించాడు. చివరికెలాగైతేనేం, 'ఫిఫ్టీ ఫిఫ్టీ' ఒప్పందం మీద 'డీల్' 'సెటిల్' అయింది.

* * *

రాత్రి భోజనం ముగించాక, ఓ మీఠా పాన్ బిగించాక, ఆపైన ఓ 'ఫిల్టర్' సిగరెట్ వెలిగించాక, టేబిలుముందు కూర్చున్నాడతను.

ఎదురుగా టేబిలుపై, పాలమీగడలాంటి తెల్ల కాగితాల దొంతర్లు... అందులోని ఓ అర దస్తా కాగితాల్ని 'రైటింగ్ పాడ్'కి తగిలించి, కొత్తకథ రాయడం ప్రారంభించాడతను.

అతడు గొప్ప సామాజిక స్పృహగల రచయితగా తెలుగు పాఠకులచే అభిమానింప బడుతున్న ప్రఖ్యాత రచయిత.

అతని పేరు పావనమూర్తి!

అతను రాస్తున్న కథపేరు... "నిజాయితీ నీ చిరునామా ఎక్కడ?"

—మధు చక్రవర్తి
(విశాఖపట్నం)